

**యదార్థవాది, భద్రాద్రి కొత్తగూడెం క్రైమ్ - 7, నవంబర్ :** నిషేధిత మావోయిస్టు పార్టీ కి చెందిన యాక్షన్ కమిటీ సభ్యుడు పోలీసుల ముందు లొంగి పోయాడు. మంగళవారం ఈ మేరకు భద్రాచలం ఏఎస్పీ పంకజ్ వివరించారు. మావోయిస్టు పార్టీ కి చెందిన 25 ఏళ్ళ పెట్టి భీమ యాక్షన్ టీమ్ మెంబర్ గా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇతను సౌత్ బస్తర్ డివిసి పార్టీ సభ్యుదన్నారు. ఛత్తీస్ ఘడ్ చింతగుప్ప పి.ఎస్. సుకుమా జిల్లా కు చెందిన వాడు. ఏఎస్పీ, 141 బేటాలియన్ అధికారుల ఎదుట లొంగిపోవడం జరిగినదన్నారు. పెట్టి భీమ 2012 సంవత్సరంలో నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీలో చేరి 2016 వరకు పార్టీ మెంబర్ గా గొల్లపల్లి ఎల్ వో ఎస్ లోను, 2017 నుండి 2018 వరకు జనతన సర్కార్ లోను, 2018 నుండి 2019 వరకు కిష్టారం ఎల్ఎస్ లొ, 2020 నుండి సౌత్ బస్తర్ డివిసి లో యాక్షన్ టీమ్ మెంబర్ గా పనిచేసినట్లు చెప్పారు. ఇతను చత్తీస్గడ్ ఏరియా లో పలు ఘటనలలో పాల్గొన్నాడు. మావోయిస్టు పార్టీ పసలేని డొల్ల సిద్ధాంతాలు నచ్చక, అనాగరిక ఆలోచనలతో ఆదివాసి ప్రజల పట్ల మావోయిస్టు పార్టీ అనుసరిస్తున్న తీరు పట్ల అసహనం చెంది లొంగిపోయినట్లు చెప్పారు. ఆపరేషన్ చేయూత లో భాగంగా పోలీసు, 141 బేటాలియన్ సిఆర్ పియఫ్ అధికారుల కౌన్సెలింగ్ వలన ఇతను జనజీవన స్రవంతిలో కలిసినట్లు చెప్పుకొచ్చారు. లొంగిపోయిన ఇతనికి ప్రభుత్వం తరపున అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను అందేలా జిల్లా పోలీస్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందనీ హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ వినీత్ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన "ఆపరేషన్ చేయూత" కార్యక్రమం సత్ఫలిస్తుందన్నారు. ఇటీవల జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన కౌన్సిలింగ్ కార్యక్రమం గురించి తెలుసుకున్న మావోయిస్ట్ పార్టీ దళ సభ్యులు, నాయకులు బయటకు రావడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు.

## సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ రాగమయి

**ఎదురు చుసిన ఎంపికతో కాంగ్రెస్ క్యాడర్ లో జోష్..**



**యదార్థవాది, సత్తుపల్లి - 7, నవంబరు :** సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థి సీటు విషయంలో టెన్షన్ తొలిగి పోయింది. అనుకున్న ఉదంగానే స్థానిక కాంగ్రెస్ నేత డాక్టర్ మట్టా దయానంద్ భార్య డాక్టర్ రాగమయి కి అధిష్టానం కేటాయించారు. ఈమె అభ్యర్థిగా ఎంపిక కావడంతో సత్తుపల్లి కాంగ్రెస్ పార్టీ క్యాడర్లొ హర్షాతిరేకలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ అధిష్టానం ప్రస్తుతం ఉన్న పరిస్థితులను పరిగణలోకి తీసుకొని గెలుపుకు అవకాశం ఉన్న అభ్యర్థిని ఎంపిక చేసిందని ప్రజల్లో సైతం చర్చ జరుగుతుంది. చాలా కాలంగా ప్రజల్లో మమేకమై నియోజకవర్గంలో విస్తృతంగా తిరుగుతూ అన్ని వర్గాల ప్రజలకు ఆమెతోపాటు భర్త దయానంద్ చాలా దగ్గరైయ్యారు. మటలు చెప్పడమే కాక ప్రజల అవసరాల మేరకు పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు కూడా కొనసాగిస్తున్నారు. ప్రజా వైద్యుల కుటుంబంగా ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితులైన స్వాతంత్ర సమరయోధులు డాక్టర్ మట్టా కృష్ణమూర్తి, డాక్టర్ మట్టా ఆరోగ్యంల వారసత్వాన్ని కొనసాగిస్తున్న డాక్టర్ మట్టా దయానంద్ అడుగుజాడల్లోనే ఆయన సతీమణి డాక్టర్ రాగమయి నడుస్తున్నారు. అనారోగ్యంతో మరణించిన వీరి కుమార్తె ఆశ పేరుతో ఆశా స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి చాలా కాలంగా పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారు. తొలి నుంచే కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న వీరి కుటుంబం నుంచి పూర్వం డాక్టర్ మట్టా ఆరోగ్యం సత్తుపల్లి ఎంపీపీగా పని చేశారు. 2014లో వైయస్సార్సీపి అభ్యర్థిగా దయానంద్ పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. అనంతరం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. టిఆర్ఎస్ పార్టీ బి ఆర్ ఎస్ గా మారినప్పటికీ కెసిఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా రాజకీయ దయానంద్ కు సహకారం అందలేదు. దింతో ఇటీవలే బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే కుల ధ్రువీకరణ పత్రాలు వివాదం నేపథ్యంలో దయానంద్ కు లీగల్ చిక్కులు ఎదురవడంతో పోటీ నుంచి తప్పుకుని తన సతీమణి రాగమయి కి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చేలా మాజీ ఎంపీ రేణుకా చౌదరి సహకారం తీసుకున్నారని తెలుస్తుంది. ఈసారి పరిస్థితులు ఆశజానకంగా ఉండటంతో తప్పక విజయం లభిస్తుందని ఆయన తోపాటు కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి.

## ఇల్లందులో 7 నామినేషన్లు దాఖలు



**యదార్థవాది,,ఇల్లందు - 7, నవంబర్ :** ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ నవంబర్ 3 నుండి కొనసాగుతుంది. అందులో భాగంగా మంగళవారం ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి కాశయ్య తెలిపారు. భూక్యా రవీంద్ర నాయక్ బిజెపి అభ్యర్థిగా, కోరం కనకయ్య కాంగ్రెస్ ఐ అభ్యర్థిగా, లకావత్ ప్రసాద్ స్టూడెంట్ పొలిటికల్ పార్టీ అభ్యర్థిగా, బానోత్ హరిప్రియ నాయక్ బిఆర్ఎస్ అభ్యర్థిగా, గుగులోత్ రవి కాంగ్రెస్ ఐ అభ్యర్థిగా, అంగోత్ నామోదర్ కుమార్ కాంగ్రెస్ ఐ, స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడం జరిగిందని అధికారులు చెప్పారు.

చేసుకున్నారు.తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కేసీఆర్ అద్భుతమైన పథకాలతో తెలంగాణను అభివృద్ధి చేస్తున్నందుకు తెలంగాణ రాష్ట్రం మాదిగ హక్కుల దండోరా కార్యవర్గం బిఆర్ఎస్ పార్టీ కే మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం.సికింద్రాబాద్ లో పద్మారావు గౌడ్ కు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు.తెలంగాణలో ఉన్న బడుగు బలహీన వర్గాలు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.దేశంలో ఎక్కడా లేనివిధంగా మన తెలంగాణ రాష్ట్రం లో కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో ఇప్పటివరకు ప్రవేశ పెట్ట లేదు.అద్భుతమై పథకాలు



ప్రవేశపెట్టిన ఘనత కెసిఆర్ కె దక్కుతుంది. మళ్ళీ కెసిఆర్ ప్రభుత్వం ఏర్పాటు తె పేద ప్రజలలో వెలుగు వస్తుంది. తెలంగాణ లో మాదిగల కు కెసిఆర్ ప్రభుత్వం పెద్ద పీఠ వేశారుఅని అన్నారు.ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర మాదిగ హక్కుల దడోరా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కేసీఆర్ గారడీ మాటలు తెలంగాణ ప్రజలు ఇక నమ్మరు

**రెండవ విడత రైతుబంధు ఎక్కడ..? :**
**మాజీ డైరెక్టర్ పుల్లారెడ్డి**



**యదార్థవాది, సత్తుపల్లి - 7, నవంబర్ :** తెలంగాణలో రెండవ దఫా అయినా ప్రజలకు మేలు చేస్తాడని నమ్మి కేసీఆర్ ను గద్దెనెక్కించారు... ఇంత గారడి మాయగాడని ఈ 9 ఏళ్లల్లో ప్రజలు తెలుకున్నారని పంచాయతీరాజ్ ఛాంబర్ మాజీ డైరెక్టర్ భీమిరెడ్డి పుల్లారెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రైతుబంధు పథకం నవంబర్ నెలలో విడుదల చేయకపోవడం పట్ల స్పందించారు. ఈ ఎన్నికలకు భయ పడిన కేసీఆర్ అదరా బాదరగా అన్ని పథకాలు ప్రకటించి ప్రచారం చేసాడని వాస్తవాలు భిన్నంగా ఉన్నాయని విమర్శించారు. రైతు బంధు అందక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు తెలిపారు. ఖరీఫ్ పంటల పనులు ప్రారంభమయ్యాయని నిరంతర ప్రక్రియగా కొనసాగాల్సిన ఈ పథకంపై నిలినీడలు కమ్మాయన్నారు. బిఆర్ ఎస్ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్లు సిగ్గు లేకుండా తమ లోపాన్ని కాంగ్రెస్ పార్టీ పై రుద్దుతూన్నారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం వల్లనే రైతు బంధు తాత్కాలికంగా నిలిపివేశామని బిఆర్ ఎస్ మంత్రులు చెప్పడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీనుంచి ఎటువంటి ఫిర్యాదులు అందలేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని పుల్లారెడ్డి అన్నారు.

అబద్ధాలతో, కేవలం తెలివితేటలతో ప్రభుత్వాలను ఎవరైనా ఎంతో కాలం నడపలేరని కేసీఆర్ విధానాలపై తీవ్రంగా మండిపడ్డారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వం చెబుతున్న మాటలు రైతులను అయోమయానికి గురి చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం వరి మార్కెట్లోకి వచ్చిందని ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అకాల వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ వెల్లడిస్తోందని దింతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.

## బిఆర్ఎస్ చందాలు... దందాలకు ఇక చెక్ పెట్టండి

- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయం.
- అధికార పార్టీకి ఓటమి భయం: పొంగులేటి



**యదార్థవాది, ఇల్లందు - 7, నవంబర్ :** రాష్ట్రంలో బిఆర్ ఎస్ నియంత పాలన అంతం కానుందని చందాలు, దందాలకు ప్రజలు ఇక చెక్ పెట్టాలని మాజీ యంపి, టిపిసిసి ప్రచార కమిటీ కో- చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఇల్లందులొ ప్రజలకు హింసగా మారిన చందాలు దందాలకు రూపమైన బిఆర్ ఎస్ ఎమ్మెల్యే, షాడో ఎమ్మెల్యే లకు చామరగీతం పడాలని పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని రాఘబోయిన గూడెంలో బిఆర్ఎస్ తో పాటు ఇతర పార్టీల నుంచి అనేక కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య గెలిస్తే ఒక ఎమ్మెల్యే మాత్రమే ఉంటాడని అదే అధికార పార్టీ అభ్యర్థి గెలిస్తే ఒక ఎమ్మెల్యే తోపాటు దందాల షాడో ఎమ్మెల్యే ఉంటాడనేది మీ అందరికి తెలిసిందే కదా అని ఎద్దేవ చేసారు. ఎవరు కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని స్పష్టం చేసారు. ఇక అహంకార, నియంత పోకడల కేసీఆర్ ప్రభుత్వం ఘోరంగా ఓడిపోతున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. ఇల్లందు కాంగ్రెస్ అభ్యర్థిగా కోరం కనకయ్యను ఖరారు చేయడంతో అధికార పార్టీకి ఓటమి భయం పట్టుకుందని తెలిపారు. ఐదేళ్ల కాలంలో షాడో ఎమ్మెల్యేగా ఎమ్మెల్యే భర్త అన్ని వర్గాల వారిని ఇబ్బందులకు గురి చేసారని ఈ విషయం స్వయంగా బిఆర్ ఎస్ నాయకులే తిరుగుబాటు చేసారుకదా అని పొంగులేటి గుర్తు చేసారు. ఆ షాడో రూ. వందల కోట్లు దోచుకున్నాడని విమర్శించారు. ఆ డబ్బులు ఈ ఎన్ని కల్లో చల్లి గెలవాలనుకోవడం వారి భ్రమ మాత్రమే అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా స్థానిక ప్రజాప్రతినిధులను డమ్మీ చేసి అభివృద్ధి పనులన్నీ ఆయన అనుసన్నల్లోనే జరిగాయాన్నారు. ఈ విషయాలు నియోజకవర్గం ప్రజలు గమనించి ఇలాంటి వారికీ మరోసారి ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదన్నారు. ఇలాంటి దోపిడీ దారులకు ఇల్లందు నియోజకవర్గ ప్రజలు తమ ఓట్ల రూపంలో తరిమి కొట్టాలని పిలుపు నిచ్చారు. ఇల్లందులో కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య అత్యధిక మెజారిటీతో ప్రజలు గెలిపించుకుంటారనే నమ్మకం తనకుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్, కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు పులి సైదులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సుదర్శన్ ముదిరాజ్ భారతీయ జనతా పార్టీ బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించడం పట్ల ముదిరాజ్ మహాసభ సీనియర్ సిటిజన్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోర సుదర్శన్ ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లాల్ బహదూర్ స్టేడియంలో మంగళవారం సాయంత్రం జరిగిన బిజెపి బీసీ ఆత్మగౌరవ సభలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ మీ అందరి ఆశీర్వాదంతో తెలంగాణలో బీసీ సీఎం అవుతారని ప్రకటించడం సంతోషకరమన్నారు. బీసీల అభ్యున్నతి కోసం కోసం ఆలోచన చేస్తున్న భారతీయ జనతా పార్టీకి బడుగు బలహీన వర్గాల సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించి బిజెపికి బడుగు బలహీన వర్గాల ప్రజలు మద్దతు తెలిపి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ గెలిచే సీటును సిపిఐకి కట్టబెడతారా

- జిల్లాలో కాంగ్రెస్ ఎలాగెలుస్తుందో చూస్తాను..
- రేవంత్, భట్టి పై ఆగ్రహం..
- అధిష్టానంపై కాంగ్రెస్ నేత ఎడవల్లి ధిక్కార స్వరం



**యదార్థవాది, కొత్తగూడెం బ్యూరో - 7, నవంబర్ :** ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న కొత్తగూడెం టికెట్ దక్కక పోవడంతో టీపీసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ ఆగ్రహం కట్టలు తెంచుకుంది. తీవ్ర మనోవేదనకు గురైయ్యారు.కాంగ్రెస్ నాయకుల ముందు కంట తడిపెట్టుకున్నారు. అంతులేని క్షోభను వ్యక్తం చేసారు. ఈ టిక్కెట్పై పై ఎంతో ఆశలు పెట్టుకున్నారు. ఆశలు నిరుగారడంతో ఏకంగా కాంగ్రెస్ అధిష్టానానికి పలు సవాళ్ల విసిరారు. ఇక పార్టీతో తాడోపేడో అన్నట్లు తన వర్గం నాయకులు, కార్యకర్తల మధ్య చాలా భావోద్వేగానికి గురైయ్యారు. కొత్తగూడెం ఎమ్మెల్యే గా అవ్వాలనే ఆయనలోని తీవ్రమైన ఆకాంక్ష ప్రతిసారి నీరుగారిపోతుంది. ఆయన రాజకీయ జీవితంలో మళ్ళీ అదే పునరావృతమైంది. పొత్తుల్లో భాగంగా కాంగ్రెస్ అధిష్టానం గూడెం సీటును సిపిఐ పార్టీ కి కేటాయించింది. ఢిల్లీ స్థాయిలో ఈ సీటు విషయంలో వారాల తరబడి ఎంతో ఉత్కంఠ కొనసాగింది. ఎడవల్లి ఢిల్లీ స్థాయిలో చెయ్యాల్సిన ప్రయత్నలాన్ని చివరికంటూ చేసి విఫలమైయ్యారు. దింతో గతం తరహాలోనే ఆయనలో అసహనం, ఆగ్రహం కట్టలు తెంచుకుంది. తన వర్గీయుల సమక్షంలో మంగళవారం మీడియతో మాట్లాడుతూ స్పష్టమైన విమర్శలు చేసారు. గెలిచే సీటును నైతిక విలువలు లేని సిపిఐ కు ఎలాకేటాయిస్తారని అధిష్టానన్ని ప్రశ్నించారు. టిపిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి, సియల్పి నేత భట్టి విక్రమార్క పై అనేక విమర్శలు చేసారు. డబ్బుకు అమ్ముడుబోయి కాంగ్రెస్ ను రాష్ట్రంలో పతనం చేస్తున్నారని విమర్శించారు. పార్టీ కష్టకాలంలో తనతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమించమన్నారు. 40 వేల సభ్యత్వాలు చేసి రాష్ట్రంలో నెంబర్ వన్ నియోజకవర్గంగా నిలిపానన్నారు. పార్టీనీ గెలుపు దిశకు తెస్తే అక్రమంగా సిపిఐ కి కట్టాపెడతారా...మీ అంతు చూస్తాను అధిష్టానన్ని హేచ్చరించారు. త్వరలో తన వర్గం క్యాడర్ తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానన్నారు. గూడెం సీటు దక్కించుకున్న సిపిఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు కు ఎట్టి పరిస్థితుల్లోను మద్దత్తు ఇవ్వబోనని ఎడవల్లి ఖరాఖండిగా చెప్పారు.

## గూడెంలో పాత్రికేయునిగా కూనంనేని ప్రస్థానం

- పోరాటాలు.. స్వయం కృషితో ఎదిగి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి స్థాయికి..
- కూనంనేని రాజకీయ ప్రస్థానంలో ఎన్నో అటుపోట్లు...
- నిజాయితీగల నాయకుడిగా ప్రజల్లో పేరు..
- నేడు సిపిఐ అభ్యర్థిగా కూనంనేని నామినేషన్.
- గూడెంలో భారీ ప్రదర్శనకు ఏర్పాట్లు.
- హాజరు కానున్న కాంగ్రెస్, సిపిఎం, టిజెయస్ నేతలు.



**యదార్థవాది., కొత్తగూడెం బ్యూరో, 7 నవంబర్ :** కాంగ్రెస్, సిపిఎం, టిజెయస్, ఇతర ప్రజా సంఘాలు బలపరిచిన సిపిఐ అభ్యర్థిగా రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు బుధవారం నామినేషన్ వేయనున్నారు. కాంగ్రెస్, సిపిఐ ఎన్నికల పొత్తు, ఒప్పందంలో భాగంగా కొత్తగూడెం స్థానాన్ని సిపిఐకి కేటాయించిన విషయం తెలిసిందే. ఆ రాష్ట్ర సమితి తమ అభ్యర్థిగా కూనంనేని ని ప్రకటించింది. నామినేషన్ ను పురస్కరించుకుని స్థానిక లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా తెలిపారు.

### పాత్రికేయునిగా ప్రస్థానం

డిగ్రీ పూర్తి చేసిన తర్వాత కూనంనేని ప్రస్థానం పాత్రికేయునిగా ప్రారంభమైంది. విశాలాంధ్ర హైదరాబాద్ లో ఆయన సబ్ ఎడిటర్ ఉద్యోగంతో జీవితాన్ని ప్రారంభించారు. 1980 దశకంలో కొత్తగూడెంలో విశాలాంధ్ర విలేకరిగా పనిచేసేందుకు వచ్చిన ఆయన అత్యంత చురుకుగా వ్యవహరిస్తూ అనతి కాలంలోనే సమస్యలపై సింగరేణి గడ్డపై అవగాహన పెంచుకున్నారు. ఆయన రాసిన వార్తలు అప్పట్లో చర్చనీయాంశలయ్యాయి. మంచి పాత్రికేయుడిగా పేరు తెచ్చుకున్నారు. సిపిఐ పార్టీ సభ్యునిగా అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించిన కూనంనేని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1987లో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో కొత్తగూడెం మండల తొలి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అప్పట్లో ఆయన ఎన్నిక ఒక స్థానిక రాజకీయాల్లో కొత్త అధ్యయనంగా చెప్పుకున్నారు. ఆయన మండలాధ్యక్షునిగా ఉన్న సమయంలో రామాంజనేయ కాలనీ సహా పలు కాలనీలను నిర్మించారు. తనకంటూ రాజకీయంగా ముద్ర వేసుకుంటూ పయనం సాగించారు. 1999, 2004 ఎన్నికల్లో సిపిఐ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా సుజాత నగర్ నుంచి పోటీ చేసి ఓటమి చవి చూశారు. ఓటమిని స్ఫూర్తిగా తీసుకోని 2009లో కొత్తగూడెం నుంచి పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ పార్టీ మంత్రి వనమా వెంకటేశ్వరరావును ఓడించి శాసనసభకు ఎన్నికయ్యారు. శాసనసభలో సిపిఐ పక్ష ఉప నాయకునిగా పనిచేసిన కూనంనేని బయ్యారం గనులు అక్రమాలను బయిటికి ప్రపంచానికి చాటారు. 45 వేల ఎకరాల్లో లూప్లైన్ లొ ఐరన్ ఓర్ గనులు దోచుకోవాలనుకున్న బడా బాబులకు సవాల్ గా మారారు. కూనంనేని కి అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఎన్నో అన్ని రకాల ఆఫర్లు వచ్చినా తిరస్కరించి, ఎంతో నిజాయితీ చాటి "పార్టీ లైన్' దాటని కమ్యూనిస్టుగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పదిలం చేసుకున్నారు. ఎమ్మెల్యే గా వున్నపుడు అనేక సమస్యలను ప్రస్తావించి ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీ లొ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 2014లో పోటీ చేసి గూడెం నుంచి ఓటమి చెందారు. కూనంనేని 2018 ఎన్నికల్లో సిపిఐ, కాంగ్రెస్ మధ్య అవగాహన ఉండడంతో కొత్తగూడెంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి నిజాయితీగా కృషి చేశారు. గెలిచిన ఎమ్మెల్యే వనమా మిత్ర బంధానికి దగా చేసి బిఆర్ఎస్లొ చేరిపోయారు. 2023 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఐ ఒప్పందంలో భాగంగా సిపిఐకి కొత్తగూడెం స్థానం కేటాయించడంతో కూనంనేని మళ్ళీ పోటీ చేస్తున్నారు. బిఆర్ఎస్, బీజేపీ, బిఎస్పీ పార్టీలు తప్ప అన్నివర్గాల ప్రజల, సంఘాల మద్దత్తు ఆయనకు లభిస్తుంది.

### పట్టణ కార్యదర్శి నుంచి రాష్ట్ర కార్యదర్శి దాక

సాధారణ సభ్యునిగా కమ్యూనిస్టు పార్టీలో చేరిన కూనంనేని కొత్తగూడెం పట్టణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షునిగా కూనంనేని పని చేస్తూ రైతాంగ సమస్యలపై అనేక ఆందోళనలు నిర్వహించడంతో పాటు అప్పట్లో ఆయన రైతాంగ సమస్యలపై రాసిన వ్యాసాలు పలువురిని ఆకట్టుకునేవి. 2004లో సిపిఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2009లో శాసనసభకు ఎన్నిక కావడంతో. కార్యదర్శి పదవి నుంచి తప్పుకున్నారు. 2018లో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన కూనంనేని 2020, 2022లో రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం జాతీయ సమితి సభ్యులుగా, రాష్ట్ర కార్యదర్శిగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా పని చేస్తున్నారు.

### నామినేషన్ కు హాజరు కానున్న నారాయణ, ప్రముఖులు

కొత్తగూడెంలో బుధవారం జరగనున్న కూనంనేని సాంబశివరావు నామినేషన్ కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కాంగ్రెస్ నాయకులు పోట్ల నాగేశ్వరరావు, నాగా సీతారాములు, సిపిఐ నాయకులు పోటు ప్రసాద్, బి. అయోధ్య, రావులపల్లి రాంప్రసాద్,సిపిఎం నాయకులు కనకయ్యతో పాటు టిజెఎస్ ఇతర ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు హాజరు కానున్నారు.

భూనిర్వాసితులు అడ్డుకోగా.. తాజాగా పైళ్ళ శేఖర్ రెడ్డి భార్య వనిత రెడ్డి వలిగొండ మండలం, పులిగిల్ల గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని గ్రామస్తులు అడుగడుగున అడ్డుకోవడం జరిగింది. దళిత బంధు స్కీము, బిసి బంధు స్కీము, గృహలక్ష్మి పథకాలను అర్హులైన వారికి గాకుండా.. సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఇచ్చుకున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా.. బీఆర్ఎస్ కార్యకర్తలకు, గ్రామస్తులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని వారు.. గ్రామంలోకి ఏ విధంగా వస్తారని మహిళలు నిలదీశారు.

# నేనూ, సుధీర్ రెడ్డి దోస్తులం

**యదార్థవాది, రాచకొండ, 7 నవంబరు :** ఎల్బీనగర్‌లో బీఆర్ఎస్ నాయకులు రామ్మోహన్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో రెండు సార్లు పోటీ చేసి కొద్దిపాటి ఓట్లతో అర్.కృష్ణయ్యపై ఓడిపోవడం జరిగింది. గతంలో నాకు సుధీర్ రెడ్డి మధ్య ఉన్న విభేదాలు అందరికీ తెలుసు. నాకు సుధీర్ రెడ్డికి ప్రస్తుతానికి ఎలాంటి విబేధాలు లేవు. మేము పోటీ చేసిందానికంటే ఎక్కువగా సుధీర్ రెడ్డి గెలుపు కోసం పనిచేస్తాం. మేము పోటీ చేద్దాం అనే ఆలోచనతోనే ఉండగా కాంగ్రెస్ పార్టీలోకి టికెట్ కోసం వెళ్ళడం జరిగింది. అవగాహన లేని వ్యక్తులు ఇక్కడ పోటీలో ఉన్నారు...వారి మాటలను జనం నమ్మే పరిస్థితి లేదని అన్నారు.

నాకు టికెట్ ఇస్తానని నమ్మించి కాంగ్రెస్ పార్టీ... పార్టీలో చేర్పించుకొని మోసం చేసింది. మోసగాళ్ళకు నేను మొసగాన్ని నన్ను కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది కాబట్టి నేను ఆ పార్టీకి మోసం చేసి బయటకు వచ్చినా. ఇక్కడ బిసి బిడ్డ పోటీలో ఉండవచ్చు నేను బీసినే నాకు అన్యాయం జరిగింది.

నాకు న్యాయం జరగనప్పుడు నేను ఎట్ల పనిచేస్తానని అన్నారు. అందుకే పార్టీలో నన్ను నమ్ముకొని ఉన్న నా అనుచలకు న్యాయం చేయడం కోసం కావచ్చు...పార్టీ పెద్దల కోసం కావచ్చు పార్టీ కోసం పనిచేస్తా. సీఎం,కెటిఆర్,హరీష్ రావు నాకు ఇచ్చిన బలమైన హామీ మేరకు తిరిగి బిఆర్ఎస్ లో చేరాను. రాబోయే రోజుల్లో డీ లిమిటేషన్ అయ్యే అవకాశం ఉంది.నీకు పార్టీలో సముచిత స్థానం కల్పించి టికెట్ ఇస్తాం అని మాకు చెప్పి హామీ ఇవ్వడం జరిగింది. సుధీర్ రెడ్డి నేను ఇద్దరం కలిసి ఎల్బీనగర్ ను బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తామని అన్నారు.

# కాంగ్రెస్ కు తాటి వెంకటేశ్వర్లు రాం రాం

**యదార్థవాది, భద్రాద్రి కొత్తగూడెం, 7 నవంబరు :** తెలంగాణలో పార్టీలనుంచి పక్క పార్టీలకు జంపింగ్ లు సాధారణాయ్యాయి. తాజాగా అశ్వారావుపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో అసంతృప్తి వున్నా తాటి వెంకటేశ్వర్లు ను మంత్రి హరీష్ రావు బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. హరీష్ రావు సమక్షంలో బీఆర్ఎస్ లో తాటి వెంకటేశ్వర్లు చేరనున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు గెలుపు కోసం అయన కృషి చేస్తారని సమాచారం.

# చంద్రబాబుకు కంటి చికిత్స పూర్తి

(మొదటి పేజీ తరువాయి భాగం)

ఆస్పత్రి నుంచి కాన్వాయ్‌లో టీడీపీ చీఫ్ ఇంటికి బయలుదేరి వెళ్లిపోయారు. జూన్‌లో చంద్రబాబు ఎడమ కంటికి సర్జరీ జరుగగా.. ఇప్పుడు కుడి కంటికి శస్త్ర చికిత్స జరిగింది. ఇంటికి చేరుకున్న తర్వాత ఆయన పూర్తిగా విశ్రాంతి తీసుకోనున్నారు. మరోవైపు చంద్రబాబును చూసేందుకు పెద్ద సంఖ్యలో టీడీపీ అభిమానులు ఆసుపత్రికి వచ్చారు. స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్టు కేసులో చంద్రబాబు 52 రోజుల పాటు జైల్లో ఉన్నారు. ఆ సమయంలో జైల్లో కనీస సౌకర్యాలు లేకపవడంతో ఆరోగ్య సమస్యలు వచ్చాయి. బరువు తగ్గారు. ఆయనకు మొదటి నుంచి చర్మ సంబంధిత సమస్య ఉంది. జైల్లో విపరీతమైన ఉక్కపోత కారణంగా ఆ సమస్య మరింత పెరిగింది. అయితే వ్యక్తిగత వైద్యుడిత చికిత్స అందించేందుకు జైలు వర్గాలు నిరాకరించాయి. చివరికి కేటరాక్ట్ అపరేషన విషయంలోనూ ప్రభుత్వ వైద్యుడితో ఉదయం ఒకలా.. సాయంత్రం మరోలా నివేదికలు ఇప్పించారు. ఈ విషయాలన్నీ వివరిస్తూ.. హైకోర్టులో చంద్రబాబు మధ్యంతర బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి.. మధ్యంతర బెయిల్ నాలుగు వారాల పాటు ఇచ్చారు. తర్వాత హైదరాబాద్ వచ్చిన ఆయన హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో రెండు రోజుల పాటు పరీక్షలు చేయించుకున్నారు. ఓ రోజు ఆస్పత్రిలోనే అడ్మిట్ అయ్యారు. ఆ తర్వాత ఏఐజీకి వచ్చిన చంద్రబాబు ఒకరోజు ఇక్కడే ఉండి పలు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. చర్మ సంబంధిత సమస్యపై చికిత్స చేసినట్లుగా తెలుస్తోంది. వైద్య పరీక్షల ఫలితాలను బట్టి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆయన కొన్ని రోజుల పాటు విశ్రాంతి తీసుకునే అవకాశం ఉంది. మరో వైపు చంద్రబాబుపై ఏపీ సీఐడీ పోలీసులు వరుసగా కేసులు నమోదు చేస్తున్నారు. ఓ సారి మద్యం కేసు.. మరోసారి ఇసుక కేసు.. ఇలా కేసులు పెడుతూనే పోతున్నారు. వాటన్నింటిపై ఎప్పటికప్పుడు చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా తనను అరెస్టు చేయడానికి ఎన్నికల సన్నాహాలు దెబ్బతీయడానికి తప్పుడు కేసులు పెడుతున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. తనకు 17ఏ సెక్షన్ వర్తిస్తుదంని.. గవర్నర్ అనుమతి లేకుండా తనపై కేసులు పెట్టడం చట్ట విరుద్ధమని వాదిస్తూ.. చంద్రబాబు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ పూర్తయింది. రెండు, మూడు రోజుల్లో తీర్పు రావాల్సి ఉంది. ఆ కేసుల్లో చంద్రబాబుకు అనుకూలంగా తీర్పు వస్తే ఈ కేసులన్నీ చట్ట విరుద్ధమవుతాయి.



వగ్గెల మిత్రసేన



తాటి వెంకటేశ్వర్లు



మెచ్చా నాగేశ్వరరావు

## పేట నియోజకవర్గంలో ప్రజల తీర్పు

**యదార్థవాది, అశ్వారావుపేట, 7 నవంబర్:** అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో బాగాంగా 2009లో అశ్వారావుపేట ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గంగా ఏర్పాటు చేసారు. అప్పటి నుండి ఇప్పటి వరకు మూడు సార్లు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం నాల్గవ సారి ఎన్నికలు జరగబోతున్నాయి. నియోజకవర్గం ఎర్పడి నాటి నుండి నెటి వరకు జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే గా ఒక్కసారి గెలిచిన అభ్యర్థి మరోసారి గెలిచే అవకాశం లేకుండా ప్రజలు విలక్షణ తీర్పు ఇస్తున్నారు. మూడు సార్ల జరిగిన ఎన్నికల్లో మూడు పార్టీల నుండి పోటి చేసిన ముగ్గురు వేర్వేరు అభ్యర్థులకు పట్టంకట్టి ప్రత్యేకతను చాటుకున్నారు.వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

### కొత్త నియోజకవర్గం ఏర్పాటు...

సత్తుపల్లి నియోజకవర్గంలో కలిసి వున్న అశ్వారావుపేటను 2009లో జరిగిన పునర్విభజనలో బాగంగా కొత్తగా ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గం ఏర్పాటు చేసారు. 2009లో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నపుడు మొదటి సారి జరిగిన అశ్వారావుపేట అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వగ్గెల మిత్రసేన విజయం సాధించారు. మిత్రసేన ప్రధాన ప్రత్యర్థి మహకూటమిలో బాగంగా పోటి చేసిన సిపిఎమ్ అభ్యర్థి పాయం వెంకయ్యపై 5107 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2009 ఎన్నికలలో పది మంది అభ్యర్థులు పోటి చేసారు.

### తెలంగాణ ఏర్పడిన తరువాత...

2014లో ఎన్నికల నాటికి పూర్తిగా రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. 2014 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుండి వగ్గెల మిత్రసేన. టిఆర్ఎస్ నండి జారే ఆదినారాయణ, పోటో చేయగా తాటి వెంకటేశ్వర్లు వైఎస్సాఆర్సిపి నుండి, మెచ్చా నాగేశ్వరరావు తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా పోటి చేసారు. ఈ ఎన్నికలలో టిడిపి అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుపై వైఎస్సాఅర్సిపి అభ్యర్థి తాటి వెంకటేశ్వర్లు 930 ఓట్లతో గెలుపొందారు.

### 2018 ఎన్నికలలో...

2018లో అశ్వారావుపేట నియోజకవర్గంలో మూడవ సారి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో టిఆర్ఎస్ అభ్యర్థిగా తాటి వెంకటేశ్వర్లుపైన మహకూటమిలో బాగంగా తెలుగు దేశం పార్టీ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు 13,117 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ సరిళిని చూస్తే అశ్వారావుపేట నియోజకవర్గం ఏర్పడిన తరువాత జరిగిన మూడు ఎన్నికలలో ఒక్క సారి గెలిచిన అభ్యర్థికి రెండవ సారి అవకాశం ఇవ్వటం లేదు అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలు. ఆంధ్ర సరిహద్దుగా ఉన్న అశ్వారావపేటలో ఇప్పటి వరకు జరిగిన మూడు ఎన్నికలలో ఒక్కసారి గెలుపొందిన అభ్యర్థికి మరో సారి ఇవ్వకుండా విలక్షణమైన తీర్పును ఇవ్వడం గమనర్హం. ఈ సారి జరిగే ఎన్నికలలో ప్రజలు ఎవ్వరికి పట్టం కడుతారో అనే ఆసక్తి రాజకీయ విశ్లేషకుల్లో ఉంది ఈ సారి అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలు తీర్పు కొద్ది రోజుల్లో జరిగే పోలింగ్ ఫలితాలను బట్టి తెలుస్తుంది.

# రాజాసింగ్‌పై మరో కేసు

**యదార్థవాది, హైదరాబాద్, 7 నవంబరు :** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై మరోసారి కేసు నమోదైంది .రెండు కేసుల్లో ఓఎం రాజాసింగ్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చారు. నామినేషన్ రోజు విద్వేషపూరిత ప్రసంగం చేశారంటూ రాజాసింగ్‌పై కేసు నమోదు కాగా.. నవరాత్రి ఉత్సవాల్లో దాండియా నిర్వాహకులను బెదిరించారని మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదు చేశారు. ఇక దసరా ఆయుధపూజ రోజు నిషేధిత ఆయుధాలను బహిరంగంగా ప్రదర్శించినందుకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన పోలీసులు వారం రోజుల్లో విచారణకు హాజరుకావాలన్నారు తెలంగాణ పోలీసులు. వివాదాస్పద ఎమ్మెల్యే రాజాసింగ్ కు మరోసారి షాక్ తగిలింది. తరచూ వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచే గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ రెండు కేసులు నమోదు చేశారు మంగళహాట్ పోలీసులు. నవరాత్రి ఉత్సవాల్లో రాజాసింగ్ విద్వేష పూరిత ప్రసంగం చేసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేయడంతో ఆయనపై కేసు నమోదు చేశారు పోలీసులు. నవరాత్రి ఉత్సవాల్లో దాండియా ఈవెంట్ కు వచ్చే వారందరి గుర్తింపు



కార్డులను తనిఖీ చేయాలన్నారు. ఈవెంట్ కోసం ముస్లిం బౌన్సర్లు డీజే ఆర్టిస్టులను రప్పిస్తే దాడులు చేస్తామని ఆ వీడియోలో పేర్కొన్నారు ఎమ్మెల్యే రాజాసింగ్. ఈ క్రమంలోనే స్థానిక నాయకుడు సమద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళాట్ పోలీసులు ఐపిసి 153ఏ,295 జీ, జీటీఎబ జీఇబి, 504 సెక్షన్ల కింద ఎమ్మెల్యే రాజాసింగ్ పై కేసు నమోదు చేశారు. అంతకుముందు దసరా సందర్భంగా నిర్వహించే ఆయుధ పూజ సందర్భంగా ఎమ్మెల్యే రాజాసింగ్ వెపన్స్ తో పాటు తల్వార్లను ప్రదర్శించడంతో రాజాసింగ్ పై కేసు నమోదు చేశారు మంగళహాట్ పోలీసులు. అందులో ప్రదర్శించిన తుపాకులు రాజాసింగ్ వ్యక్తిగత భద్రత సిబ్బందివని, వాటిని ప్రదర్శించడం నిషేధమన్నారు పోలీసులు. వెపన్స్‌తో పాటు కత్తులను ప్రదర్శించడం చట్ట విరుద్ధమని అంటున్నారు పోలీసులు. దీంతోనే ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు నమోదు చేశామని చెప్తున్నారు. వారం రోజుల్లోగా నోటీసులకు స్పందించి రాజాసింగ్ వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు పోలీసులు.మరోవైపు ఈ రెండు కేసులపై స్పందించిన ఎమ్మెల్యే రాజాసింగ్ తనను ఎన్నికల్లో నుండి అనర్హుడయ్యేలా చూడాలన్న ఉద్దేశంతోనే ఈ కేసులు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయుధ పూజ సందర్భంగా ముఖ్యమంత్రి తో పాటు మంత్రులు కూడా పూజలు చేస్తారని, వారందరిపై కూడా కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు ఎమ్మెల్యే రాజాసింగ్. ప్రభుత్వం కావాలనే తనను టార్గెట్ చేసి వేధింపులకు గురి చేస్తుందని ఒక వీడియో విడుదల చేశారు. ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న తనను పార్టీ కార్యకర్తల మద్దతు దూరం చేసేందుకు కుట్ర జరుగుతుందని ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపించారు.

# అందరివాడు వినయ్ భాస్కర్

### భారీ మెజారిటీతో గెలిపిస్తే మంత్రి అవుతాడు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



**యదార్థవాది, హనుమకొండ,7 నవంబర్:** హనుమకొండ లోని న్యూశాయం పేట సమీపంలో రజక భవనంలో రజక సంఘం, సెలూన్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనమండలి సభ్యుడు బస్వరాజు సారయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల నాయకుడు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి వినయ్ భాస్కర్ ఎంతగానో సేవ చేశాడని,అదేవిధంగా సెలూన్ అసోసియేషన్ కూడా 600 గజాలు ఇప్పించిన ఘనత వినయ్ భాస్కర్ కు దక్కుతుందన్నారు. మీరు గెలిపిస్తే ఎన్నికల తర్వాత మంత్రి అవుతాడని, మీకు మరిన్ని సేవలు చేస్తాడని ఈ సందర్భంగా తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యంత ఆత్మీయంగా పలకరించే వ్యక్తి వినయ్ భాస్కర్ అని, పశ్చిమ నియోజకవర్గ ప్రజలందరికీ మంచి భవిష్యత్తు ఉందన్నారు.కెసిఆర్ అన్ని కుల సంఘాలకు ఎంతగానో ప్రాధాన్యత ఇచ్చారని, అదేవిధంగా మన కుల సంఘానికి కూడా రూ.6 కోట్లు నిధులు ఇచ్చిన ఘనత కేసిఆర్ ప్రభుత్వానిది,బిఆర్ఎస్ పార్టీదని అన్నారు.అలాంటి ప్రభుత్వానికి మనం ఓటు వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.విస్తృతంగా ప్రచారం చేసి వినయ్ భాస్కర్ కు ఎక్కువ ఓట్లు పడేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతిలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. హనుమకొండలో వినయ్ భాస్కర్ చేసినన్ని సేవలు ఎవరు చేయలేదని, ఎక్కువ నిధులు తీసుకొచ్చి ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇంతమంది వచ్చి ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ కు మద్దతు తెలపడం ఆనందంగా ఉందని,అందరి ఆశీర్వాదం,సహకారంతో భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. నిరంతరం పేదల కోసం పనిచేసే వ్యక్తి వినయ్ భాస్కర్ అని,ఆపద వచ్చినప్పుడు ఆదుకునే వాడని, బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అని అన్నారు. మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరితో సన్నిహిత సంబంధం ఉందని, ప్రతి ఇంటిలోని వ్యక్తులు మాకు తెలుసని అన్నారు. గౌరవప్రదమైనటువంటి వృత్తి చేస్తున్నటువంటి రజకులకు, నాయి బ్రాహ్మణులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి వినయ్ భాస్కర్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

గడప కోటేష్ కుమార్ రూపొందించిన కరపత్రాలను బస్వరాజు సారయ్య ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరు ఒక్కొక్క ఇంటికి ఈ కరపత్రాల ద్వారా వెళ్లి, కెసిఆర్ రాష్ట్ర ప్రభుత్వం రజకుల అభ్యున్నతి కోసం ఏం చేసిందో తెలపాలన్నారు.కార్యక్రమానికి డాక్టర్ మధు చందర్ సభాధ్యక్షత వహించగా, కార్పొరేటర్లు చీకటి శారద ఆనంద్, నెక్కొండ కవితా కిషన్, మాజీ కార్పొరేటర్లు శివశంకర్,జోరిక రమేష్, నాయకులు సురేష్,గూడెల్లి రామచంద్రం,సమ్మయ్య,అంకయ్య, రాజు,సూర్య ప్రకాష్, రామస్వామి,సాంబయ్య, రమేష్, కృష్ణ, వేణు,నరేందర్, దుబ్బాకుల సారయ్య తోపాటు తదితరులు పాల్గొన్నారు.



**యదార్థవాది, అశ్వారావుపేట, 7 నవంబర్:** ఎన్నికల సమయాలలో ప్రజాప్రతినిధులు, నాయకలు ఓట్లు వినూత్న రీతిలో ప్రచారం చేస్తూ ఓట్లు అభ్యర్థనకు నాయకులు వింత వింత పనులు చేస్తున్నారు. అశ్వారావుపేటలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుండగా ఓ రైతు తన గేదెను శుభ్రం చేస్తుండగా ప్రచారంలో ఉన్న ఎంపిపి జల్లిపల్లి శ్రీరామమూర్తి రైతు వద్ద ఉన్న నీళ్ల బకెట్‌ను తీసుకోని శుభ్రం చేసారు. గేదెన శుభ్రంచేసి అనంతరం బిఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అన్ని పార్టీల నాయకులు ప్రచారంలో ఏ చిన్న అవకాశాన్ని కూడ వదులుకోవటం లేదు.

# అశ్వారావుపేట కాంగ్రెస్ అభ్యర్థిగా జారే

### పదేళ్ళ నిరక్షణ.. పార్టీ మార్పుతో సీటు



**యదార్థవాది, అశ్వారావుపేట, 7 నవంబర్:** అశ్వారావుపేట నియోజకవర్గం నుండి ప్రస్తుత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుండి పోటి చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానం జారే ఆదినారాయణ పేరు ఖరారు చేసింది. దీంతో కాంగ్రెస్ శ్రేణులు బాణ సంచా కాల్చి, కేకలు కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. 20 టిఆర్ఎస్‌కి అశ్వారావుపేట ప్రాంతంలో ఎవ్వరూ లేని సమయంలో ఉపాధ్యా ఉద్యోగాన్ని వదిలేసి టిఆర్ఎస్ పార్టీలో చేరి పోటికి దిగడం నిజంగా సాహసమే అని చెప్పాలి. తరువాత టిఆర్ఎస్ అధికారం లోకి రావటంతో ఉద్యోగాన్నికి రాజీనామ చేసిన జారే పార్టీ న్యాయం చేస్తుందనే ఆశతో పది సంవత్సరాలు పార్టీ సేవలు చేస్తూ వచ్చారు. కనీసం నామినేటడ్ పదవి కూడ వరించలేదు. జారే హరిశ్‌రావు శిష్యుడుగా కొనసాగుతూ వచ్చారు. పార్టీలో ఏ విధమైన అవకాశం దక్కలేదు. పదేళ్ళగా ప్రజలకు విద్యా వైద్యప రమైన సేవలు చేస్తూ ఆర్థికంగా నష్టపోయారు. బిఆర్ఎస్‌కు రాజీనామ చేసి బైటకు వెళ్ళిపోయే సమయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జారే అదినారాయణను పిలిచి ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీలోకి తీసుకెళ్ళారు. అశ్వారావుపేట అసెంబ్లీకి కాంగ్రెస్ పార్టీ నుండి పలువురు పోటి పడినప్పటికి ఎట్టకేలకు జారే ఆదినారాయణకు సీటు ఖరారు చేస్తూ కాంగ్రెస్‌అధిష్టానం ప్రకటించింది.

# డిసెంబర్ తర్వాత జోడో యాత్ర

**యదార్థవాది, న్యూఢిల్లీ, 7 నవంబర్:** నిస్తేజంగా ఉన్న కాంగ్రెస్ పార్టీలో రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' ఊపు తీసుకువచ్చింది. మొదటిదశ సెప్టెంబర్ 7, 2022న తమిళనాడులోని కన్యాకుమారి నుండి ప్రారంభమైంది. దాదాపు 4,080 కిలోమీటర్ల దూరాన్ని కవర్ చేస్తూ, యాత్ర జనవరి 2023లో జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ముగిసింది. మొత్తం 12 రాష్ట్రాల్లోని 75 జిల్లాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల గుండా 126 రోజుల పాటు సాగింది. ఈ యాత్ర కాంగ్రెస్ పార్టీకి మంచి మైలేజ్ ఇచ్చింది. రాహుల్ గాంధీ పాదయాత్రలో భాగంగా యువత, ఉద్యోగులు, రైతులతో మమేకమయ్యారు. పలు ప్రాంతాల్లో బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఆయా రాష్ట్రాల్లోని కాంగ్రెస్ నేతలు జోడో యాత్రలో రాహుల్ వెంట నడిచారు.ఇదిలా ఉంటే మొదటి విడత యాత్ర ద్వారా వచ్చిన ప్రజాస్పందనను మరోసార రిపీట్ చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో లోకసభ ఎన్నికల ముందు ఈ యాత్ర ఉండేలా కాంగ్రెస్ పార్టీ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. అంతకుముందు కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం కూడా రెండో విడత జోడో యాత్రకు ప్లాన్ చేస్తున్నట్లు వెల్లడించారు. భారత్ జోడో యాత్ర 2.0 పాదయాత్ర డిసెంబర్ 2023- ఫిబ్రవరి 2024 మధ్య ఉండే అవకాశం ఉంది. పాదయాత్రతో పాటు వాహనాల ద్వారా యాత్రను నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. మొదటి యాత్ర దేశంలోని దక్షిణం నుంచి తూర్పు వైపు సాగితే, ఈసారి తూర్పు నుంచి పడమర వైపు భారత్ జోడో యాత్ర ఉండే అవకాశం ఉంది. గతేడాది యాత్రలో రాహుల్ గాంధీ దేశంలోని నిరుద్యోగం, ద్రవ్యోల్బణం మీద కేంద్రంలోని బీజేపీ పార్టీపై విరుచుకుపడ్డారు. ఈ యాత్ర తర్వాత జరిగిన కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల ముందు దేశంలో కాంగ్రెస్ వేవ్ ఏర్పడేలా యాత్రను ప్లాన్ చేస్తోంది గ్రాండ్ ఓల్డ్ పార్టీ.

# నేను సిఎం ను అవుతా

(మొదటి పేజీ తరువాయి భాగం)

కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి అంతా తన హయాంలోనే జరిగిందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. రాజకీయంగా నష్టం వస్తుందని తెలిసినా కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. పోలింగ్ కు ముందు రైతు బంధు వేస్తారని, దాన్ని చూసి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మొండిచేయి చూపించిందని, ఉద్యోగాల భర్తీలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఈసారి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



**యదార్థవాది, బద్వేలు, 7 నవంబరు :** పిచ్చి మొక్కలు మురికి కాలువల మధ్య ఉన్న ఈ భవనం ఒకప్పుడు బద్వేలు ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయం ఇది. అక్షర సత్యం ఈ భవనంలోనే డిపో మేనేజర్ తోపాటు సిబ్బంది విధులు నిర్వహించేవారు. ఆ తర్వాత డిపో గ్యారేజీ ఏర్పడడం బస్టాండ్ విస్తరించడం గ్యారేజీ ముందు భాగంలోనే రహదారి పక్కన పక్క భవనాలు ఏర్పడడంతో డిపో మేనేజర్ కార్యాలయం ఆ భవనాల్లోకి తరలిపోయింది ఇప్పటికి కూడా డిపో మేనేజర్ కార్యాలయం పక్కా భవనాల్లోనే కొనసాగుతుంది. పక్కా భవనాల్లోకి డిపో మేనేజర్ కార్యాలయం తరలిపోయిన తర్వాత పాత భవనాన్ని అధికారులు మర్చిపోయారు. పాత భవనాన్ని గతంలో ఒక ప్రైవేట్ పాఠశాలకు అద్దెకిచ్చారు. ఆ ప్రైవేట్ పాఠశాల కూడా ఒకటి రెండు సంవత్సరాలు మాత్రమే ఇక్కడ కొనసాగింది. ప్రైవేట్ పాఠశాల కాళీ చేసిన తర్వాత ఆ భవనం గురించి ఎవరు కూడా పట్టించుకోలేదు. ఇప్పుడు కార్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలు దట్టంగా మొలిచాయి. భవనం పక్కనే మురికి కాలువ ప్రవహిస్తుంది. కార్యాలయం చుట్టుపక్కల నివాస గృహాలు ఉండడంతో మురికి కాలువల వల్ల నివాస గృహాల వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం గురించి సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన ఫలితం లేకుండా పోయింది. వర్షాకాలంలో అయితే ఇక్కడ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. సంబంధిత అధికారులు ఈ భవనం విషయంలో స్పందించి చర్యలు తీసుకుంటే స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అంతేకాక ఎంతోకాలంగా ఈ భవనం నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకుంటుంది మరి ఈ భవనం విషయం అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనేది వేచి చూడాలి.

## నిరుద్యోగ యువతీ యువకులకు అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి భాగం)

సీఎం అవుతారని ఉద్ఘాటించారు. కేసీఆర్ కు దమ్ముంటే... ఆయన రాజకీయ వారసుడెవరో ఎన్నికల తరువాత ఎవరిని సీఎం చేస్తారో ప్రకటించాలని సవాల్ విసిరారు.

కరీంనగర్ లోని 24వ డివిజన్ లో పాదయాత్ర ప్రారంభించిన బండి సంజయ్ పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ బీజేపీకి ఓటేయాలంటూ అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా నిన్న నామినేషన్ దాఖలు చేసిన. పాదయాత్ర చేస్తూ ప్రజలను కలుసుకుంటున్న. నిన్న నామినేషన్ కార్యక్రమానికి స్వచ్ఛందంగా యువత వేలాదిగా తరలివచ్చి భారత్ మాతా కీ జై... జై శ్రీరాం అంటూ బీజేపీకి మద్దతు తెలిపారు. ఈ ర్యాలీ చరిత్ర సృష్టించింది. బీజేపీ విజయానికి ఇది సంకేతం. బీఆర్ఎస్ నేతలకు ఈ ర్యాలీని చూసి మైండ్ బ్లాంక్ అయ్యింది. ఇప్పుడు పెద్ద ఎత్తున డబ్బులిచ్చి వేల మందిని తీసుకొచ్చి పోటీగా ర్యాలీ నిర్వహించేందుకు బీఆర్ఎస్ నేతలు యత్నిస్తున్నారు. మీరెన్ని చేసినా గెలుపు బీజేపీదే. ఇది నా మాట కాదు.. కేసీఆరే నిర్ణయానికి వచ్చారు. అందుకే బి.ఫాం ఇవ్వకుండా చాలా రోజులు ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థిని తిప్పలు పెట్టిండు. దీనినిబట్టి తీర్పు ఎప్పుడో డిసైడ్ చేశారు. బండి సంజయ్ అవినీతిపరుడు కాదు... ఎక్కడా భూ కబ్జాలు చేయలే. ఎవరినీ ఇబ్బంది పెట్టలే. ఇయాళ బీఆర్ఎస్ నేతల లెక్క లంగ దందా, దొంగ దందాలు చేసేటోడిని వెంటపెట్టుకుని తిరగలే. కమీషన్లు ఇప్పిస్తేనే పోలీస్ స్టేషన్లలో పనులు అయ్యేటట్లు నేను చేయడం లేదు?

నన్ను ఎంపీగా గెలిపిస్తే వేల కోట్ల నిధులు తీసుకొచ్చిన. అభివృద్ధి చేస్తున్న. కేంద్ర నిధులు తీసుకొచ్చిన. కానీ అభివృది అడ్డుకుంటోం దెవరు. రేషన్ కార్డు కూడా ఇయ్యలేనోడు ఎవరు? ఆలోచించుకోవాలి. బండి సంజయ్ పేదల కోసం పోరాడుతున్నడు. ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతునైన. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పోరాటాలు చేసి సమాజాన్ని ఏకం చేసిన. ఇప్పుడు నేను గెలిస్తే... ఆయనకు ఏకు మేకు అవుతాననే భయంతో కరీంనగర్ కు వందల కోట్లు పంపి నన్ను ఓడించాలని చూస్తున్నడు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. కేసీఆర్ కొడుకు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నడు. సీఎం కొడుకుగా కాకుంటే ఆయనది బిచ్చపు బతుకే. అయినా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నడు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాడట... ఈ 9 ఏళ్లపాటు నువ్వు చేసిందేమిటి? ఏ గడ్డి పీకినవ్? ఎందుకు ఉద్యోగాలియ్యలే. జాబ్ క్యాలెండర్ ఎందుకియ్యలే. నిరుద్యోగుల ఉసురు ఎందుకు పోసుకున్నవ్? అసలు మళ్లీ నీ ప్రభుత్వం వస్తే కదా... 50 లక్షల మంది నిరుద్యోగులు బీఆర్ఎస్ పార్టీని తరిమి తరిమి కొట్టబోతున్నారని కేసీఆర్ కొడుకుకు అర్థమైంది. అందుకే ప్రతిరోజు మళ్లీ ఛాన్స్ ఇస్తే జాబ్ క్యాలెండర్ ను ఏర్పాటు చేసి ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తానని మాయ మాటలు చెబుతున్నడు. నిరుద్యోగ తమ్ముళ్లారా... ఈ 10 ఏండ్లలో ఉద్యోగాల కోసం మీరు పడ్డ గోసను ఇంకో 23 రోజులు గుర్తుంచుకోండి. మీ కుటుంబాలు పడుతున్న బాధలను గుర్తు చేసుకోండి. మీరిచ్చే తీర్పుతో బీఆర్ఎస్ బాక్సులు బద్దలు కావాలె. మీరిచ్చే తీర్పుతో మరే రాజకీయ పార్టీ కూడా నిరుద్యోగులను మోసం చేయాలనే ఆలోచన రాకుండా చేయాలే.

బీజేపీ అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీ మేరకు బీసీ నాయకుడే సీఎం అవుతారు. బీజేపీ ఈ విషయాన్ని చెబుతుంటే... బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీసీలను కించపరుస్తున్నడు. నేను కేసీఆర్ ను సవాల్ చేస్తున్నా... నీకు దమ్ముంటే బీసీ వ్యక్తిని సీఎం చేస్తానని చెప్పే దమ్ముందా? కనీసం గతంలో ఇచ్చిన మాటకు నిలబడి దళితుడిని సీఎం చేసే దమ్ముందా? నువ్వు నిజంగా మనిషివైతే.. నీలో తెలంగాణ రక్తమే ప్రవహిస్తే... నీ రాజకీయ వారసుడెవరో ప్రకటించే దమ్ముందా?.... నా సవాల్ కు స్పందించాలి. బంగారు తెలంగాణ తెస్తానని కేసీఆర్ చెప్పిన మాటలు నమ్మి జనం ఓట్లేస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిండు. పేదల ఉసురు పోసుకున్నడు. అందుకే ఈ ఎన్నికలు తెలంగాణ ఆత్మగౌరవానికి, బీఆర్ఎస్ నేతల అహంకారానికి మధ్య జరుగుతున్న ఎన్నికలు. ధర్మ రక్షకులకు, ధర్మ ద్రోహులకు..... రజాకార్లకు, రామరాజ్య స్థాపకులకు మధ్య జరుగుతున్న ఎన్నికలివి. రామరాజ్యం కావాలా? రజాకార్ల రాజ్యం కావాలా? తేల్చుకోండి.

కాంగ్రెస్, ను గెలిపిస్తే... కాసులకు అమ్ముడుపోతారు. ప్రమాణ స్వీకారం చేయకముందే పార్టీలు మారే చరిత్ర కాంగ్రెస్ ది. 2014లో 21 మందిని గెలిపిస్తే 10 మంది అమ్ముడుపోయారు. 2018లో 19 మందిని గెలిపిస్తే ఏకంగా 14 మంది టోకుగా అమ్ముడుపోయారు.

ఎన్నికల్లో భాగంగా ములుగు నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ములుగు నియోజకవర్గంలో ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ హోరాహోరీగా నెలకొంది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా టికెట్ దక్కించుకున్న బడే నాగజ్యోతి ప్రచారంలో దూసుకుపోతుండగా అంతే దీటుగా కాంగ్రెస్ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క ప్రచారంలో దూకుడు పెంచింది. నియోజకవర్గంలోని ఓటర్లకు పార్టీలకి సంబంధించిన మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ ప్రత్యర్థి పార్టీ పై విమర్శలు చేస్తూ ఇరువురు ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.

### కాంగ్రెస్ కి ఓటు వేస్తే అనార్థలే
### - బడే నాగజ్యోతి

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ములుగు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నుండి అనూహ్యంగా టికెట్టు దక్కించుకున్న బడే నాగజ్యోతి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారంలో దూసుకుపోతోంది. గెలుపే లక్ష్యంగా బడే నాగజ్యోతి తన ప్రధాన ప్రత్యర్థైన కాంగ్రెస్ అభ్యర్థి సీతక్కను ఓడించేందుకు ప్రచారంలో కాంగ్రెస్ పైన ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ కి ఓటు వేస్తే అనర్థాలు తప్పవు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి సీతక్క ములుగు ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేకపోయిందని,కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలను తెలంగాణ రాష్ట్రానికి పొరుగున ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేయడం సాధ్యం కాదని, కాంగ్రెస్ ను నమ్మి మోసపోవద్దని, రాష్ట్రంలో మరల బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కావున తనని గెలిపిస్తే ములుగు అభివృద్ధికి కృషి చేస్తానని ప్రచారంలో వివరిస్తూ ముందుకు సాగుతోంది.

### బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే అప్పుల ఊబిలోనే తెలంగాణ
### - ఎమ్మెల్యే సీతక్క





2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పై పోటీ చేసి గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి సీతక్క కాంగ్రెస్ పార్టీలో ప్రధాన నాయకురాలిగా చోటు దక్కించుకుంది. ప్రస్తుతం జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ములుగు నియోజకవర్గ స్థాయిలో ప్రచారంలో దూసుకుపోతూ బీఆర్ఎస్ అభ్యర్థికి దీటుగా ప్రచారంలో పాల్గొంటుంది. ములుగు క్షేత్రంలో ఉంటూ విస్తృతంగా నియోజకవర్గంలో పర్యటిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకు వెళ్తోంది. ప్రచారంలో ప్రధానంగా సీతక్క బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యం చెందిన అంశాల పైన ప్రజలకు వివరిస్తూ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను రాబట్టేందుకు ప్రయత్నిస్తూ అదే స్థాయిలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టబోయే ఆరు గ్యారంటీలను ప్రతి ఇంటికి చేరవేస్తానంటూ హామీ ఇస్తూ ప్రచారంలో ముందుకు సాగుతోంది.

ఎన్నికల ప్రచారంలో భాగంగా ములుగు నియోజకవర్గంలో ప్రస్తుతానికి బీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు నియోజకవర్గంలో జోరుగా ప్రచారంలో పాల్గొంటూ ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు.ఒకవైపు బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ములుగు నియోజకవర్గంలో అభ్యర్థిని గెలిపించుకోవడానికి ప్రచారాన్ని ముమ్మరం చేయగా, మరో వైపు కాంగ్రెస్ అభ్యర్థి ములుగు ఎమ్మెల్యే సీతక్క ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రచారంలో ముందుకు సాగుతోంది. ఏదిఏమైనా ములుగు నియోజకవర్గంలో పెద్దగా వ్యక్తిగత దూషణలకు తావు లేకుండా ప్రచారం సాఫీగా సాగుతూ ఉండడంతో అధికారులు, నియోజకవర్గ ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

# కొల్లాపూర్‌లో టీడిపి ఓట్లు ఏటు వైపు

- చెక్కుచెదరని టిడిపి క్యాడర్
- తెలుగుదేశం పార్టీ డాక్టర్ పగడాల శ్రీనివాసరెడ్డి
- రాబోయే ఎన్నికల్లో టిడిపి ఓట్లు కీలకం



**యదార్థవాది, నాగర్ కర్నూల్, 7 నవంబరు :** కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో తండాలలో తెలుగుదేశం పార్టీకి పూర్తి పట్టు ఓటు బ్యాంకు కలిగి ఉంది ఇటీవల తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీ చేయడం లేదని ప్రకటించింది ఈ నేపథ్యంలో కొల్లాపూర్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఓట్లు కీలకం కాబోతున్నాయని పెద్దకొత్తపల్లి మండలం కల్వకుల గ్రామం చెందిన రవిశంకర్ గౌడ్ అన్నారు తెలుగుదేశం పార్టీ కొల్లాపూర్ అసెంబ్లీ ఇన్చార్జి ప్రజా డాక్టర్ ప్రజల మనిషి డాక్టర్పగిడాల శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ క్యాడర్ పటిష్టంగా ఉంది దాదాపు 20 నుంచి 30 వేల ఓట్ల వరకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు ఇప్పటికి చెక్కుచెదరకుండా ఆత్మగౌరవని కాపాడుకుంటూ పరిటాల శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో కొల్లాపూర్ నియోజక వర్గంలోని కోడేరు పెద్దకొత్తపల్లి కొల్లాపూర్ వీపనగండ్ల పెంట్లవెల్లి పానగల్ మండలాల్లో తెలుగుదేశం పార్టీ బలంగా పాతుకపోయిందని ఆయన అన్నారు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వి సుధాకర్ రామస్వామి రామకృష్ణ తో పాటు మరికొంతమంది నాయకులు తెలుగుదేశం పార్టీని ఇటీవల పూర్తిస్థాయిలో బలోపేతం చేశారని ఆయన అన్నారు ఈ ఎన్నికల్లో పోటీ చేయకపోయినప్పటికీ తెలుగుదేశం పార్టీ ఓట్లు ఎటువైపు మొగ్గు చూపుతున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు టిడిపి ఓట్లను కాంగ్రెస్ పార్టీ లేదా భారత రాష్ట్ర సమితి పార్టీలు తెలుగుదేశం పార్టీ ఓట్ల కోసం గాలం వేస్తున్నట్లు తెలిసింది ఏది ఏమైనప్పటికీ కొల్లాపూర్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అసెంబ్లీ ఇన్చార్జి పగిడాల శ్రీనివాసరెడ్డి ఎటువైపు మొగ్గు చూపుతారని ప్రజలు ఎదురుచూస్తున్నారు ఏ పార్టీ ముందుకొచ్చి తెలుగుదేశం పార్టీ క్యాడర్ను కైవాసం చేసుకుంటుందో వేచి చూడాల్సిన అవసరం ఉంది ఇప్పటికే అనేకమంది నాయకులు తెలుగుదేశం పార్టీ ఓటు బ్యాంకు కోసం ఎదురుచూస్తున్నారు. తెలుగుదేశం పార్టీని కొల్లా పూర్ నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో బలపేతం చేయడంలో డాక్టర్ పగడాల శ్రీనివాస్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు వి సుధాకర్ మరియు రామస్వామి రామకృష ఆధ్వర్యంలో పార్టీని పటిష్టంగా బలోపేతం చేశారు. కొల్లాపూర్ లో ఇంటింటా ప్రచారం ముమ్మరంగా చేపట్టారు.

# మంత్రి ఎర్రబెల్లిని టెన్షన్ పెడుతున్న ఎన్నారై!!

**యదార్థవాది, వరంగల్, 7 నవంబరు :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన నియోజకవర్గంగా మారిన పాలకుర్తి నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారింది. ఓటమి ఎరుగని నేతగా పేరు తెచ్చుకున్న ఎర్రబెల్లి దయాకర్ రావును ఈ ఎన్నికల్లో ఓడించే లక్ష్యంతో హస్తం పార్టీ వ్యూహాలు రచిస్తోంది. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కి కంచుకోటగా ఉన్న పాలకుర్తి నియోజకవర్గంలో ఎర్రబెల్లి దయాకర్ రావు పై పోటీకి ఓ ఎన్నారై రంగంలోకి దిగింది. మొదట ఎర్రబెల్లి దయాకర్ రావు పై ఎన్ఆర్ఐ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి పోటీ చేస్తారని అంతా భావించారు. కానీ పౌరసత్వ సమస్య కారణంగా ఆమె కోడలు యశస్విని రెడ్డిని అభ్యర్థిగా బరిలోకి దించారు. అభ్యర్థిగా అవకాశం దక్కించుకున్న యశస్విని రెడ్డి కూడా ప్రజాక్షేత్రంలో దూసుకుపోతున్నారు. ఎర్రబెల్లి రాజకీయ అనుభవంలో సగం వయసు కూడా లేని యువతి రాజకీయ ఆరంగేట్రం చేసి ఎర్రబెల్లికే సవాల్ విసురుతూ ఉండడంపై స్థానికంగా ఆసక్తికరచర్చ జరుగుతుంది.

ఇప్పటివరకు ఒకసారి ఎంపీగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించిన ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తి నియోజకవర్గం లో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రిగా కొనసాగుతూ ఏడోసారి అసెంబ్లీలో అడుగుపెట్టడానికి ఎన్నికల బరిలోకి నిలిచారు. ఎర్రబెల్లి దయాకర్ రావు విజయం సునాయాసంగా జరుగుతుంది అని భావిస్తే, ఎన్ఆర్ఐ యశస్వినీ రెడ్డి ఎన్నికల బరిలోకి దిగడంతో అది కాస్త జటిలంగా మారింది.

పాలకుర్తి నియోజకవర్గంలోకి ఎంట్రీతోనే ఝాన్సీ రెడ్డి ఆమె కోడలు యశస్విని రెడ్డి భారీ ర్యాలీ నిర్వహించి గులాబీ మంత్రికి టెన్షన్ పుట్టించారు. ఎర్రబెల్లి దయాకర్ రావు పై విరుచుకుపడుతూ, తమకు అవకాశం ఇస్తే నిజమైన అభివృద్ధి ఏమిటో చూపిస్తామని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. పారాచ్యూట్ నేతలకు పాలకుర్తిలో స్థానం లేదని ఎర్రబెల్లి దయాకర్ రావు వారి మాటలను తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్నారు.

ప్రత్యర్థులు ఎవరైనా సరే గెలుపు మాత్రం తనదేనని ఎర్రబెల్లి ధీమా వ్యక్తం చేస్తున్నారు. అంగబలం, అర్థబలం ఉన్న ఝాన్సీ రెడ్డి దూకుడు చూసి ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రస్తుతం నియోజకవర్గంలో విరివిగా పర్యటిస్తూ కాలికి బలపం కట్టుకొని తిరుగుతున్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు తో పాటు ఆయన సతీమణి ఉషా దయాకర్ రావు కూడా ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నారు. మొత్తానికి ప్రస్తుతం పాలకుర్తి నియోజకవర్గంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకి టెన్షన్ పట్టుకుంది.

# మార్పు కావాలి-కాంగ్రెస్ రావాలి

### సరికొత్త నినాదంతో కాంగ్రెస్ ప్రచారం

**యదార్థవాది, హైదరాబాద్, 7 నవంబరు :** త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ మార్పు కావాలి-కాంగ్రెస్ రావాలి పేరుతో ప్రచారాన్ని ప్రారంభించింది. సీఎం కేసీఆర్ ఇస్తున్న హామీలు, వాటి వైఫల్యాలను ఎత్తి చూపుతూ కాంగ్రెస్ పార్టీ రూపొందించిన వీడియోలు ప్రజలను ఆలోచింపజేసే విధంగా ఉన్నాయి. సీఎం కేసీఆర్ హామీలు ఇవ్వడం, వాటిని ప్రజలు ఎత్తిచూపడం ఈ వీడియోలో కనిపిస్తోంది. సీఎం కేసీఆర్ ఇస్తున్న తప్పుడు హామీలను తెలియజేసేలా కాంగ్రెస్ పార్టీ వినూత్న రీతిలో ఈ వీడియోలు రూపొందించింది. కేసీఆర్ తప్పుడు మాటలను ప్రజలు నమ్మడం లేదని, ఈ సారి కారు పంక్చర్ అవడం ఖాయమని.. మార్పు కావాలి-కాంగ్రెస్ రావాలి అని ప్రజలు కోరుకుంటున్నట్లు రూపొందించిన ఈ వీడియోలు అందరినీ ఆకర్షిస్తున్నాయి.

తాటిపర్తి జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మంగళ వారం మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వామినీ దర్శించుకొన్నారు. నామినేషన్ వేసే ముందు జీవన్ రెడ్డి ఆరాధ్య దైవం ఆంజనేయస్వామి నీ దర్శించుకొని, ముడుపులు కట్టిన అనంతరం నామినేషన్ వేయడం ఆనవాయితీగా వస్తోంది. జీవన్ రెడ్డి జగిత్యాలలో ఈ రోజు నామినేషన్ వేయనున్న నేపథ్యంలో కొండగట్టు ఆంజనేయ స్వామి వారిని దర్శించుకొని, స్వామి వారికి ముడుపులు కట్టారు. జీవన్ రెడ్డి దంపతులకు అర్చకులు ఆశీర్వచనం అందజేశారు.

## కాంగ్రెస్లో దామోదర కలకలం

### త్వరలో పార్టీ వీడుతారన్న ప్రచారం



**యదార్థవాది, సంగారెడ్డి, 7 నవంబరు :** పటాన్ చెరు, నారాయణఖేడ్ లో కాంగ్రెస్ టికెట్ల ప్రకటనపై మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తన అనుచరులు కాట శ్రీనివాస్, సంజీవ రెడ్డికి టికెట్ దక్కకపోవడంతో పార్టీపై మండిపడుతున్నారు. రెండ్రోజుల్లో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం వుందని సమాచారం. డబ్బులు ఇచ్చిన వాళ్ళకే పార్టీలో టికెట్ ఇస్తున్నారని దామోదర ఆవేదన వ్యక్తం చేసారు. మీడియాతో మాట్లాడటానికి నిరాకరించారు. ఈ నేపథ్యంలో దామోదర రాజనర్సింహ ఇంటికి టీపీసీసీ ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి చేరుకున్నారు. దామోదర ఇంట్లో లేకపోవడంతో వెనుదిరిగారు. సంజీవ రెడ్డి నారాయణఖేడ్ నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించిన విషయం తెలిసిందే. టికెట్ రాకపోవడంతో అయన కుడా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. సంజీవరెడ్డికి కాంగ్రెస్ పెద్దల ఫోన్ చేసినట్లు సమాచారం. జహీరాబాద్ ఎంపీ టికెట్ ఇస్తామని ఆఫర్ ఇచ్చినా సంజీవ రెడ్డి నిరాకరించారు.

## గాంధీభవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆందోళన

**యదార్థవాది, హైదరాబాద్, 7 నవంబరు :** టీపీసీసీ కార్యాలయం గాంధీ భవన్ లో మంగళవారం అందోళన జరిగింది. మాజీ మంత్రి చిన్నారెడ్డి కి టికెట్ కేటాయించి మళ్ళీ రద్దు చేయడాన్ని నిరసిస్తూ అయన అనుచలరు ఆందోళనకు దిగారు. డబ్బులు లేవని చిన్నారెడ్డికి టికెట్ రద్దు చేయడాన్ని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. వనపర్తి టికెట్ మాజీ మంత్రి చిచెన్నారెడ్డికి ఇవ్వాలని కార్యకర్తలు ఆందోళనకు దిగారు.

## మహేశ్వరం కాంగ్రెస్ లో అంతా ఓకే

**యదార్థవాది, రంగారెడ్డి, 7 నవంబరు :** మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డ పారిజాత నర్సింహారెడ్డిని ఆమె నివాసంలో కాంగ్రెస్ అభ్యర్థి కిచెన్న గారి లక్ష్మారెడ్డి మంగళవారం కలిసారు. తనతో కలిసి పని చేయాలంటూ అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపుకు సహకరించాలంటూ కోరారు. దానికి పాఆరిజాత సుముఖం వ్యక్తం చేసారు. తమ మధ్య ఎటువంటి భేదాభిప్రాయాలు లేవని, అందరం కలిసి మహేశ్వరంలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## పెద్దపల్లి విద్యార్థుల ఎంపిక




**యదార్థవాది, నాగర్ కర్నూల్, 7 నవంబరు :** రాష్ట్రస్థాయి రోల్ ప్లే పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల పెద్దపల్లి విద్యార్థుల ఎంపిక స్థానిక జాతీయోన్నత పాఠశాల నాగర్ కర్నూల్ నందు నిర్వహించిన జిల్లా స్థాయి రోల్ ప్లే పోటీలు నేడు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం కొరకు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని, మానవ శ్రేయస్సులో పోషక ఆహార పాత్ర ఎంతో ఉందని, ఎన్ని సమస్యలు వచ్చినా వాటిని అధిగమించి క్షేమంగా జీవించడం ఎంతో అవసరమని అన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సెక్టోరల్ అధికారి షర్ఫుద్దిన్ మాట్లాడుతూ అంతర్జాల పరికరాలను మరియు ప్రసార మాధ్యమాలను సానుకూలంగా వినియోగించుకొని మాదకద్రవ్యాలను దూరంగా పెట్టి జీవితాన్ని సుఖమయం చేసుకోవాలని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి కారణాలు వాటి నివారణ అనే అంశంపై ప్రదర్శననిచ్చిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దపల్లి విద్యార్థులు మొదటి స్థానంలోనూ కేజీబీవీ కోడేరు విద్యార్థులు రెండవ స్థానంలోనూ నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలపెద్దపల్లి విద్యార్థులు తేదీ 09.11.2023న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి న్యాయ నిర్ణయితలు సురేష్ బాబు మురళీధర్ రావు మరియు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు గెలుపొందిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ గోవిందరాజు చరవాణి ద్వారా అభినందించారు.

